క్లుప్తంగా

నేలకూలిన భారీ వృక్షం



నేలకూలిన భారీ రావి వృక్షం

ఆత్మకూరు: మండలంలోని ముష్టపల్లి గ్రామంలో మంగళవారం వందేళ్ల వయస్సున్న భారీ రావిచెట్టు నేలకొరిగింది. పది రోజులుగా ఈ చెట్టు పక్కకు ఒరుగుతూ ఉండడంతో గ్రామస్తులు గుర్తించి చెట్టు సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని ముందుగానే అప్రమత్తం చేశారు. చెట్టు కూలే సమయంలో ఎవరూ రచ్చకట్టపై ఉండకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కూలడంతో రెండు విద్యుత్ స్తంభాలు, రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం చెట్టును పూర్తిగా తొలగించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. తాగునీటి ట్యాంక్ పైప్‌లైన్ కనెక్షన్ విడిపోయి నీరు వృథాగా పోతున్న విషయాన్ని ఈనెల 21న సాక్షి దినపత్రిక ఎత్తిచూపుతూ ×తాగునీటి వృథా.. భవిష్యత్ వ్యథ× శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణమ్మ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి ట్యాంక్‌కు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

కంప్యూటర్ విరాళం



కంప్యూటర్ అందజేసిన సొసైటీ సభ్యులు

నందికొట్కూరు: మండల పరిధిలోని దామగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన డివైన్ వర్డ్ సోషల్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు కంప్యూటర్‌ను విరాళమిచ్చారు. రూ.30 వేల విలువ చేసే కంప్యూటర్‌ను ఫాదర్ మాధవరం సురేష్ మంగళవారం హెచ్‌ఎం అనిత జీవన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శైలజ, రెజీనా, విజయకుమారి, ఆదిలక్ష్మి, మోహన్‌రావు, సుంకన్న పాల్గొన్నారు.

'నవోదయ'కు కొణిదెల విద్యార్థుల ఎంపిక



వరుణ్



తేజశ్విని

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు విద్యపోగు వరుణ్, వాదేళ్ల తేజశ్విని నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. జనవరి 18న నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో కొణిదేల గ్రామంలోని ప్రతిభ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఐదో తరగతి విద్యార్థి విద్యపోగు వరుణ్, అదే గ్రామంలోని రేణుక యూపీ స్కూల్ ఐదో తరగతి విద్యార్థిని వాదేళ్ల తేజశ్విని ప్రతిభ కనబరిచి నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు ఆయా స్కూళ్ల నిర్వాహకులు తెలిపారు.

మద్దతు ధరతో పంట ఉత్పత్తుల కొనుగోలు

పగిడ్యాల: ఈ ఏడాది రబీ సీజన్ కింద సాగు చేసిన శనగ, మినుము, కందులను మద్దతు ధరతో కొనుగోలు చేసుకోవడానికి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనగలు క్వింటా రూ.5,650, కందులు రూ.7,550, మినుములు రూ.7,400 మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మిద్దెపై నుంచి జారిపడి వృద్ధుడి మృతి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని చిన్న దేవళాపురం గ్రామానికి చెందిన మన్నేని రమణయ్య(72) సోమవరం సాయంత్రం మిద్దెపై నుంచి జారి కింద పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రమణయ్య మిద్దెపై నుంచి కిందకు దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగానే మృతి చెందాడు.

రేపు కానుకల లెక్కింపు

మహానంది: ఈ నెల 27న మహానందిలోని హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తి మెరిసి.. నల్లమల మురిసి

- భ్రమరాంబను ఆడపడుచుగా కొలుస్తున్న కన్నడిగులు
- ఏటా ఉగాదికి అమ్మవారికి సారె సమర్పణ
- నల్లమల మీదుగా శ్రీశైలం క్షేత్రానికి బయలుదేరిన భక్తులు

ఇల కైలాసంగా శోభిల్లుతున్న శ్రీశైలం మహాక్షేత్రంలో కొలువైన భ్రమరాంబా దేవి భక్తులకు అమ్మవారైనా.. కన్నడిగులకు మాత్రం ఆడపడుచు. ఎంతమంది భక్తులు ఎన్ని నైవేద్యాలు సమర్పించినా పుట్టినింటి నుంచి అందే కానుకను మించిందేదీ లేదు. ఏటా ఉగాదికి తన పుట్టినింటి నుంచి అందే సారె కోసం అమ్మవారు ఇప్పటికే సిద్ధమయ్యారు. కన్నడిగులు కూడా తమ ఆడపడుచుకు చీరసారె సమర్పించేందుకు వందల కిలోమీటర్ల నుంచి కాలినడకన బయలుదేరారు. భక్తులపై అమ్మవారి ప్రేమకు.. అమ్మవారిపై కన్నడిగుల భక్తికి నల్లమల మురిసిపోతోంది. – ఆత్మకూరు



శ్రీశైలం మహాక్షేత్రానికి నాగలూటి మెట్ల మార్గాన వెళ్తున్న కర్ణాటక భక్తులు



నాగలూటి వీరభద్రస్వామికి టెంకాయలు సమర్పిస్తున్న కర్ణాటక భక్తులు

కన్నడిగులు మల్లికార్జునస్వామిని అల్లుడిగా, భ్రమరాంబమాతను ఆడపడుచుగా తరతరాలుగా కొలుస్తున్నారు. అందులో భాగంగా ఏటా ఉగాది సందర్భంగా తమ ఆడపడుచును చూసేందుకు వందల కి.మీ. దూరం నుంచి కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు పాదయాత్రగా నల్లమల మీదుగా శ్రీశైలం క్షేత్రానికి తరలివస్తున్నారు. కన్నడ సంప్రదాయరీతిలో గాజులు, పసుపు, కుంకుమ, నూతన పట్టుచీరలు, రవికెలతో పాటు కొత్త చాటతో మహిళలు తలపై పెట్టుకుని భ్రమరాంబదేవి ఎదుట ఉంచి తమను, తమ కుటుంబాన్ని చల్లగా చూడమని మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి ఉత్సవాలను తరించి తన్మయత్వం చెందుతారు.

వృద్ధ మల్లికార్జునుడిని వరించిన భ్రామరీ..

పురాణాలు, ఇతిహాసాల ప్రకారం కర్ణాటకలో పార్వతీమాత భ్రమరాంబగా వెలిసిందని ప్రతీక. ఆమె అనునిత్యం మహాశివుడిని ప్రార్థిస్తూ, స్మరిస్తూ ఉండడంతో స్వప్నంలో పరమేశ్వరుడిని వరించినట్లు చరిత్ర చెబుతోంది. ఇలా ఆ పరమేశ్వరుడు 'తుమ్మెదలు నీ వెంట వస్తాయి, అవి ఎక్కడ నిలిస్తే అక్కడ నేను నిన్ను వరిస్తాను' అని భ్రమరాంబదేవికి తెలిపాడని, ఆ క్రమంలోనే భ్రమరాంబదేవి తుమ్మెదల వెంట బయలుదేరి శ్రీశైలంలో నిలిచిపోవడంతో అక్కడ భ్రమరాంబకు మహాశివుడు వృద్ధ రూపంలో కనిపించాడని చెబుతారు. వృద్ధ మహాశివుడు అయినా పర్వాలేదని, తనను వరించడమే గొప్ప విషయమని పార్వతీదేవి భావించడంతో ఇద్దరికీ కన్నడిగులు వివాహం చేసినట్లు ప్రతీక. కన్నడిగులు అప్పటి నుంచి మల్లన్నను అల్లుడిగా, అమ్మవారిని తమ ఆడపడుచుగా భావించి ఏటా ఉగాదికి శ్రీశైలానికి చీర, సారె సమర్పిస్తూ వస్తున్నట్లు చరిత్ర తెలుపుతోంది.

లక్షలాదిగా తరలివెళ్తున్న భక్తులు

ఈఏడాది ఉగాది ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి లక్షలాదిగా శ్రీశైలం మహాక్షేత్రానికి తరలివస్తున్నారు. బళ్లారి, రాయచూరు, గుల్బర్గా, సోలాపూర్, బెంగళూరు, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన బయలుదేరారు. నాగలూటి క్షేత్రంలో వెలిసిన వీరభద్రస్వామివారిని దర్శించి, కాయ, కర్పూరం సమర్పించి పాదయాత్రను తిరిగి కొనసాగిస్తారు. నందికోలు, పల్లకీలు, తదితర రూపాల్లో నృత్యాలు, భజనలు చేసుకుంటూ శ్రీశైలం క్షేత్రానికి చేరుకుంటారు.

పదేళ్లుగా శ్రీశైలం క్షేత్రానికి వెళ్తున్నాం



నేను, మా అమ్మ, నాన్నతో కలిసి పదేళ్లుగా శ్రీశైలం క్షేత్రానికి వస్తున్నాం. చిన్నప్పటి నుంచి శ్రీశైలం అంటే ఎంతో ఇష్టం. మా ఆడపడుచు భ్రమరాంబమాతను దర్శించుకుని, ఆశీస్సులు పొందుతున్నాం. దారి పొడవునా మాకు దాతలు అన్నదానం, నీళ్లు కల్పించడం సంతోషంగా ఉంది. కొండాకోనలు దాటుకుంటూ క్షేత్రానికి చేరుకోవడం ఎంతో ఉత్సాహంగా ఉంది.

– భీమేశ్వరప్ప, రాయచూరు, కర్ణాటక రాష్ట్రం

కుటుంబ సభ్యులతో వెళ్తున్నాం



యేటా కుటుంబంతో కలిసి శ్రీశైలం మహాక్షేత్రానికి వస్తాం. మా ఇంటి ఆడపడుచు భ్రమరాంబ, అల్లుడిగా భావించే మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుంటాం. తర్వాత రెండు, మూడు రోజులు అక్కడే నిద్రించి, అవసరమైతే తమ ఆడపడుచు భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను రెండు ఉంచి మూడుసార్లు దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటాం. ఆ తర్వాత తిరిగి వెళ్తాం. ఉగాది నాటికి శ్రీశైలం క్షేత్రానికి రావడం పర్వదినంగా భావిస్తాం.

– పరమేశ, సిరుగుప్ప, కర్ణాటక రాష్ట్రం

ఎస్పీ దృష్టికి జాయింట్‌వీల్స్ ఏర్పాటు వివాదం



తర్తూరులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో జాయింట్‌వీల్స్ ఏర్పాటు వివాదం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అధికార కూటమి పార్టీకి చెందిన వర్గానికే తర్తూరులో జాయింట్‌వీల్స్ ఏర్పాటుకు అనుమతి నివ్వటం, మరో వర్గానికి అనుమతినివ్వకపోవటంతో వివాదాస్పదమైంది. ఈక్రమంలో జాయింట్ వీల్స్ సామగ్రి వాహనాలు జాతరలోంచి పంపించేశారు. దీంతో ఇరువర్గాల మధ్య జాయింట్‌వీల్స్ ఏర్పాటు సమస్య నివురుగప్పిన నిప్పులా ఉంది. విషయాన్ని పోలీసులు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన తర్తూరు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ క్రిష్టాబాయి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 40 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో 17 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్, మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వెలుగోడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చన్నారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయలేదని చూపుతున్న నాయకులు

పగిడ్యాల: సీసీ రోడ్లు నిర్మించి సైడ్ బర్మ్‌కు మట్టి వేయకుండా నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ డిమాండ్ చేశారు. మంగళవారం పడమర ప్రాతకోటలోని ముస్లింకాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్థానిక నాయకులకు కమీషన్లు ముట్టజెప్పి సీసీ రోడ్లను నాసిరకంగా వేశారని, సైడ్ బర్మ్‌కు మట్టి వేయకుండా వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వెలుగోడు: అనారోగ్యానికి గురై శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 58 మందికి మంజూరైన రూ.50 లక్షల చెక్కులు, C MAJY పథకం కింద ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3 లక్షల చెక్కులను లబ్ధిదారులకు మంగళ వారం వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే అందజేశారు.

సర్వేలు పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ప్రభుత్వం అప్పగించిన సర్వేలను త్వరిగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని వానాల గ్రామంలో పర్యటిస్తూ సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జియో కోఆర్డినేట్, మిస్సింగ్ సిటిజన్, ఆధార్ లేని చిన్నారులు, వర్క్ ఫ్రం హోమ్ సర్వేల గురించి ఆరా తీశారు. సర్వేలు ఆలస్యమైనందునే గ్రామ సభలు వాయిదా వేశామన్నారు. సర్వేల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖాజా ఉన్నారు.

మసీదులో చోరీ

కొత్తపల్లి: మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామ మసీదులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రంజాన్ మాసం కావడంతో ముస్లింలు ప్రార్థనలు ముగించుకుని రాత్రి 10 గంటల తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఉదయం వెళ్లి చూడగా మసీదులోని ఇన్వర్టర్‌కు అమర్చిన రూ.13 వేల విలువచేసే బ్యాటరీ, గ్యాస్ సిలిండ్ కనిపించకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మసీదు ఆవరణలో దుండగుడి పాదముద్రలు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

భూ రీసర్వేకు రైతులు సహకరించాలి

కొత్తపల్లి: ప్రభుత్వం నిర్వహించే భూ రీసర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న సూచించారు. మంగళవారం గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం వద్ద భూ రీసర్వేపై సర్పంచు మశమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, మండల సర్వేయర్ అనుషా, వీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అపరాధ రుసుంతో నెలాఖరి వరకు గడువు

నందికొట్కూరు: పన్ను చెల్లించేందుకు 50 శాతం అపరాధ రుసుంతో ఈనెల ఆఖరి వరకు గడువు ఉందని మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. మంగళవారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడారు. పట్టణ ప్రజలు ఆస్తి, కుళాయి పన్నులు 50 శాతం అపరాధ రుసుంతో ఈ నెల 31లోపు చెల్లించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పరమటూరు రోడ్డు సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలానికి చెందిన వెంకట నాగరాజు (28) ఆత్మకూరు నుంచి నంద్యాల వైపు బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సమీపంలోని సీసీ పుటేజ్ ఆధారంగా ఏపీ 39 ఎస్‌టీ 4287 నంబర్ కారుగా ప్రాథమికంగా నిర్ధారించామని, కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

శ్రీశైలం: కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పాదయాత్రగా తరలివచ్చే భక్తుల పట్ల మర్యాదగా వ్యవరించాలని జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పోలీసు అధికారులకు సూచించారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్త్ నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, వన్‌టౌన్ సీఐ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ విద్యార్థుల విరాళాలు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం ఆదర్శ గురుకుల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ డి.రంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శనివారం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థి రమేష్‌బాబు ఆర్వో ప్లాంట్ కోసం రూ.4.5 లక్షలు, ఎం.గోపాల్ ఎలక్ట్రికల్ పనుల కోసం రూ.4.5 లక్షలు, కె.గంగన్న ఆడిటోరియం కోసం రూ.2.5 లక్షలు, 2000 బ్యాచ్ విద్యార్థులు ఈ–సెట్ మెటీరియల్ కోసం రూ.1.30లక్షలు, 1987 బ్యాచ్ విద్యార్థులు ఆన్‌లైన్ ఫ్రీ కోచింగ్ కోసం రూ.2లక్షలు, ఎస్.వెంకటరావు సీసీ కెమెరాల కోసం రూ.70 వేలు, రాంజీనాయక్ ఫ్యాన్లు, లైటింగ్ కోసం రూ.50 వేలు, ఎస్.హరీష్‌బాబు విద్యార్థుల అభివృద్ధి కోసం ఏటా రూ.25 వేలు విరాళమివ్వనున్నట్లు ప్రకటించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల అభివృద్ధికి సాయమందిస్తున్న పూర్వ విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆటపాటలతో బోధించాలి

పాములపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో బోధన చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలిత ప్రభావతి, వెంకటేశ్వరమ్మ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని తుమ్మలూరు గ్రామంలో జెడ్పీహెచ్ స్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో విద్య నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో పోషణ్‌బీ – పడాయిబీ కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించిందన్నారు.

మల్లన్న భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తుస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

పాములపాడు: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబా అమ్మవార్ల దర్శనార్థమై కాలినడకన వెళ్లే భక్తులకు స్థానిక శివబ్రహ్మ మల్లికార్జున స్వామి ఆశ్రమంలో మంగళవాం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వహకుడు శేషన్న గౌడు మాట్లాడుతూ దాతల సహకారంతో 46 ఏళ్లుగా భక్తులకు అన్నదానం కొనసాగిస్తున్నామన్నారు.

యాంత్రీకరణను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: వ్యవసాయంలో యాంత్రీకరణను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ విజయశేఖర్ రైతులకు సూచించారు. మంగళవారం మిడుతూరు మండల పరిధిలోని జలకనూర్, సుంకేసుల గ్రామాల పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శనగ, మినుము పంటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలను ఆర్జించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ పీర్ నాయక్, ఏఈఓ అశోక్ పాల్గొన్నారు.

- **పాములపాడు:** మండలంలోని ఇస్కాల, వానాల గ్రామాల్లో వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సూచనలిచ్చారు.
- **జూపాడుబంగ్లా:** మండలంలోని తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల్లో ఏఓ కృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుములు, శనగలను మద్దతు ధరతో విక్రయించుకనేందుకు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.
- **ఆత్మకూరు:** శ్రీపతిరావుపేట, పిన్నాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ, డీపీఎం నరేంద్రరెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని రైతులకు వ్యవసాయంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ అధికారిణి అరుణ, పాల్గొన్నారు.
- **వెలుగోడు:** మోత్కూరు, మాధవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్వింటా శనగ రూ.5,650, కందులు రూ.7,500, మినుములు రూ.7,400 మద్దతు ధరతో విక్రయించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు.
- **మహానంది:** ఎరువులను విచక్షణా రహితంగా వాడొద్దని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. అబ్బీపురం గ్రామంలోని లింగమయ్య అరుగు వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

సంక్షిప్తం

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ పాండురంగనాయక్

ఆత్మకూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తున్న కన్నడ భక్తులకు ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ పాండురంగనాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ విశ్వనాథ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

భ్రామరికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవి అమ్మవారికి మంగళవారం కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి, పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించారు.

భక్తులకు తాగునీటి సౌకర్యాలు

మహానంది: మహానందిలోని రాజగోపురం వద్ద భక్తులకు తాగునీరు కోసం ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లు చేయించారు. అక్కడ కుళాయిలను ఏర్పాటు చేయిస్తున్నట్లు ఆయన చెప్పారు.

అర్చకుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

మహానంది: కొలనుభారతి క్షేత్రం అర్చకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని మహానంది ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శంకరయ్యశర్మ, ముఖ్య అర్చకులు మంగళవారం డిమాండ్ చేశారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో మంగళవారం కారు – బొలేరో ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. కోడుమూరుకు చెందిన రాఘవేంద్ర, కుటుంబ సభ్యులు కారులో వస్తుండగా ఎదురుగా ప్రకాశం జిల్లా పందిర్లపల్లెకు చెందిన బొలేరో వాహనం ఢీకొంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

– గాజులపల్లె రోడ్డులోని సినిమా హాల్ సెంటర్ వద్ద ఆటో – బొలేరో ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

దారి విషయంలో ఘర్షణ

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో దారి విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన రాజుపై దారి విషయంలో ఓ వ్యక్తి దాడికి దిగి గాయపరిచాడని, గాయపడిన రాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

జూపాడుబంగ్లా: ఉపాధి పనుల వద్ద కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పారుమంచాల గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాని కోరారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున పనుల వద్ద నీడ, మెడికల్‌కిట్ ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు: తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ, పార్కులు తదితర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, చైర్‌పర్సన్ మారూఫ్‌ఆసియాకు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి పనులు కల్పించాలి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తాటిపాడు గ్రామస్తులు

జూపాడుబంగ్లా: ఉపాధి పనులు కల్పించాలని మండల పరిధిలోని తాటిపాడు గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో పనులు కల్పించి తమ గ్రామానికి కల్పించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం ఎంపీడీఓ గోపికృష్ణకు వినతిపత్రం అందజేశారు.



తాటిపాడు సమీపంలో అండర్‌పాస్ కింద నిలిచిన వర్షపు నీరు

చినుకుపడితే చిత్తడే!



తాటిపాడు ప్రధానరహదారిలో నిలిచిన వర్షం నీరు

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లో సరైన సిమెంటు రోడ్లు, డ్రైనేజీల్లేకపోవటంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. జూపాడుబంగ్లా, తాటిపాడు, తంగడంచ, పారుమంచాల, తర్తూరు, తరిగోపుల, 80బన్నూరు తదితర గ్రామాల్లో డ్రైనేజీలు, సిమెంటు రోడ్లు లేని కారణంగా చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపైనే వర్షపు నీరు నిలుస్తున్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 340సీ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తాటిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో అండర్‌పాస్ లోతట్టులో నిర్మించటంతో మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు నిలిచిపోయింది. ద్విచక్రవాహనదారులు, గ్రామస్తులు రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు చర్యలు తీసుకుని గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించటంతో పాటు తాటిపాడు అండర్‌పాస్ కింద వర్షం నీరు నిలవకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.